

# మందారమాల
## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 29

# కంచికి వెళ్ళని కథలు



కథ కంచికి, మనం ఇంటికి అనేది అనాదిగా వస్తున్న సామెత.

కంచిలో తెలుగు కథలేమీ కనపడవు, వినపడవు అనేది అసలు సిసలైన నిజం.

మరి ఈ కథలన్నీ ఎక్కడికి వెడుతున్నట్టు?

శ్రీకాకుళానికి.

అక్కడ వున్న తెలుగు కథల నిధికి.

శ్రీకాకుళంలోని కథానిలయానికి.

0 0 0

'బాబూ! నా మొఖం సూసి కాకపోతే నా పెద్దల మొఖం సూసన్నా సెప్పేది విని సెవినుంచు. నన్నూ నా పిల్లల్నీ కూలోళ్ళను సేయకు. తరతరాల బట్టి మాది రైతు కుటుంబం. ఇయాలా, రేపు నా మనవలు కూడా ఎదిగొస్తన్నారు. నానూ, నా కొడుకులూ కాకపోయినా, నా మనవలైనా నీ రుణం తీర్చేసుకొంటారు. కానీ వుంచేసుకోరు. నీ రుణం సానాకాలం బట్టి ఉండిపోనాది. కానీ యింకొక్క మూడేళ్ళ గడువియ్'

'బాబయ్యా! ఆ బంజరు బంగారవే పండుతాదో యెండే పండుతాదో ఆ సంగతటుంచండి. దాని మదుపులకు డబ్బులేదు. ఆ మదపులకి మళ్ళా అప్పు సెయ్యాల. అది బంగారం పండే నాటికి ఆ అప్పు వడ్డీలతో పెరిగి దానికి సరిపడా నిండుకుంటాది. కష్టపడ్డం మావొంతు. అనుబవించడం అప్పిచ్చినోడొంతు. ఆ అప్పు తీరిందాక మాం అక్కడ కూలికుంటాం'

ఒక్క దీర్ఘ నిశ్వాసం విడిచి రాముడు ముందుకు వెళ్ళి ఆ కాగితం పై వేలుముద్ర వేసేడు. తరువాత రాముడు కొడుకుల్నీ, మనవల్నీ ఒక్కొక్కరినే పిలిచి వేలుముద్ర వేయమన్నాడు.

'ఓరే నాయన! నువ్వా కాయితం మీద ఏలు ముద్రెట్టిన్నాడు నీకూ నాకూ తండ్రీ కొడుకుల రణం సెల్లిపోద్దని సెప్పినాను, సెల్లిపోనాది. ఇదిగో నా మాట నిబద్ది సూసుకో' అంటూ పరుగెత్తి ముందుకొచ్చి, భుజం మీద గోనె బస్తా ఒక్కుదుటున ఎదరకు లాగి కొనలు బట్టుకుని దులిపాడు.

యజ్ఞం అనే కథని చదివి వుంటే, చదివిన మొదటిసారీ, ప్రతిసారీ మనల్ని ఈ సన్నివేశం ఎంత విభ్రాంత పరిచిందో, కలచి వేసిందో, కన్నీళ్ళు తెప్పించిందో, ఆవేశం తెప్పించిందో మనకి తెలుసు. ఈ కథ ఇప్పటిదాకా చదవకపోతే, మీరు తెలుగు సాహిత్యంలోనే కాక, అసలు ప్రపంచ సాహిత్యంలోనే మణిదీపమైన ఈ కథని వెంటనే తప్పక చదవమని కోరుతున్నాను.

ఈ యజ్ఞం కథ వ్రాసినది కాళీపట్నం రామారావుగారు. కారా మాష్టారు. 1964 మే నెలలో వ్రాసిన కథ. అంటే సరిగ్గా 45 ఏళ్ళ క్రితం ఇదే నెలలో వ్రాసినది. ఈనాటికీ చదువుతుంటే ఒళ్ళు జలదరించే కథ! రక్తాన్ని వేడెక్కించే కథ!

చాట్ల శ్రీరాములు బృందం వేసిన నాటిక చూసి, నా నోట మాటకి బదులు, కళ్ళల్లో నీళ్ళు తెప్పించిన కథ!

0 0 0

1924 నవంబర్ తొమ్మిదవ తారీఖున కాళీపట్నం రామారావుగారు శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు గ్రామంలో జన్మించారు. చిన్నప్పటినించీ గ్రంధాలయానికి వెళ్ళి భారతితో సహా ఎన్నో రకాల పత్రికలూ, నవలలూ, నాటకాలూ, ప్రభంధ కావ్యాలూ చదివారు. తిరుపతి వెంకటకవులు, విశ్వనాధ సత్యనారాయణ, వేదుల, కరణశ్రీ, జాషువా, గాంధీ, గరిమెళ్ళ... ఇలా ఎంతో మంది రచనలు చదివి, తన వ్యక్తిత్వానికి సాన పెట్టుకున్నారు. 14వ ఏటనే ముద్దు అనే కథ వ్రాశారు. తర్వాత ఠాగూర్, శరత్, గోపీచంద్, చలం, శ్రీపాద, కొడవటిగంటి మొదలైనవారు ఆయనకి అభిమాన రచయితలయినారు.

విభిన్న భావాలపై పుస్తకాలు చదవటం వల్ల, వాటి ప్రభావంతో ఆయనలో ఎన్నో ఆలోచనలు మొదలయాయి. అప్పుడే ఆయనకి చిత్రకళ మీద కూడా ఆసక్తి కలిగింది. 1950 వరకూ వాటర్ కలర్ బొమ్మలు వేశారు. 1943లో చిత్రగుప్తలో కార్డు కథల నించీ, ఎన్నో పత్రికలలో కథలు వ్రాశారు.

ఆయన గుమాస్తాగానూ, టైపిస్ట్‌గానూ, ఆఫీసర్‌గానూ.. ఇలా ఎన్నో ఉద్యోగాలు చేశారు. 1946వ ఏట ఆయనకి వివాహం జరిగింది. తర్వాత తనకిష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరటానికని, సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌లో చేరారు. 1948లో సెయింట్ - ఆంథోని స్కూల్లో ఉపాధ్యాయుడుగా చేరి, 1979లో రిటైర్ అయేవరకూ అక్కడే పనిచేశారు కారా మాష్టారు.

ఆ ట్రైనింగ్‌లో వున్నప్పుడే ఆయనకి మార్క్సిజంతో పరిచయం ఏర్పడింది. ఆ భావాలు ఆయనలో బాగా నాటుకుపోయాయి.

0 0 0

కాళీపట్నం రామారావుగారు వ్రాసిన అన్ని కథల్లోకీ తలమానికమైనది యజ్ఞం. ఇంకా చావు, కుట్ర, హింస, ఆర్తి, భయం, శాంతి, జీవధార, వెళ్ళిపోయింది, ఆహ్వానం, వెనుకచూపు... ఇలా 25 కథలు మాత్రమే ఆయన వ్రాసినవాటిల్లో ఆయన లెఖ్ఖ పెట్టేవి.

'నా తొలి రచన ప్లాటుఫారమో కథకీ, కీర్తికాముడు కథకీ మధ్య వచ్చిన చిన్నచిన్న రచనలు కొన్నిటిని విడిచిపెడితే, పాఠకులకు నేనీయ గలిగిన రచనలు ఈ పాతికే. వీటిని వరసగా చదివితే, నేను రాయటానికి ఎంత కష్టపడ్డానో అర్థమౌతుంది. ఏడాదికి ఒక కథ రాయటం అబ్బురం. ముమ్మరంగా వ్రాసిన సంవత్సరాల్లో రెండూ మూడూ రాసేను. కొంతకాలం సంవత్సరాల తరబడి రాయలేక పోయాను. నాలో Urge వుందిగాని Passion లేదన్నారు ఒక పెద్దాయన. ఈమధ్యే అన్న ఆ మాట ఇప్పటి నా స్థితిని సరిగానే చెబుతుంది' అంటారు కారా.

ఆ ఇరవై ఐదు కథలే కాకుండా ఆయన ఎన్నో వ్యాసాలు, కథలు వ్రాయటం మీద సలహా వ్యాసాలు, సంపాదకీయాలు మొదలైనవి కూడా వ్రాశారు.

ఆయన ఇంకా ఏమంటారంటే... 'ఎంతటి పరిశీలనా శక్తి కలవారైనా, ఒక స్థిరమైన ప్రాపంచిక దృక్పథం లేని వారెవ్వరూ గొప్ప రచనలు చేయలేరు. గొప్ప రచయితలు ఎరిగిన వ్యక్తుల మీదా, జరిగిన సంఘటనలు తీసుకునీ కథలు వ్రాయరు. వాస్తవ జీవితం నుండి వారి వారి ప్రాపంచిక దృక్పథం మేరకు జీవిత వాస్తవాలను గ్రహిస్తారు. వాటిని వ్యక్తం చేసేందుకు అవసరమైన సంఘటల్నీ, పాత్రల్నీ, సన్నివేశాలనీ కల్పిస్తారు. అంతా కల్పనే అయినా, వారి చిత్రణలో ఆ కల్పన జీవితమంత సహజంగా కనపడుతుంది'

కారాగారికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సాహిత్య ఎకాడమీ పురస్కారాలు ఇచ్చాయి. కాకపోతే ఆయన రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించారు. కారణం కొందరు విరసం సహ సభ్యులు అప్పుడు జైల్లో వున్నందున.

0 0 0

1996వ సంవత్సరంలో కథాశిఖరం కాళీపట్నం రామారావుగారికి, జనపీఠ బహుమతితో పాటు కథాభిషేకం చాల ఘనంగా జరిగింది. ఆ సందర్భంలో నా రెండు కథా సంపుటాలు 'తెలుగువాడు పైకొస్తున్నాడు తొక్కేయండి', 'చెట్టు క్రింద చినుకులు' రెండు పుష్పాలుగా ఆయనకి అర్పించటం నా అదృష్టం.

0 0 0

'యజ్ఞం' మొదటిసారి చదవగానే నాకు చప్పున గురజాడ రాసిన 'మీ పేరేమిటి?' జ్ఞాపకం వచ్చింది. ఈ రెంటి మధ్యా ఎన్నో పుష్కరాల ఎడం వున్నది. కాని ఇలాటి కథ మరొకటి అడ్డం వుందని నాకు తెలీదు. గురజాడ ఒక గ్రామానికి వున్న మౌఢ్యాన్ని గురించి రాస్తే, కాళీపట్నం ఒక గ్రామానికి సంబంధించిన రాక్షసాన్ని గురించి రాశాడు' అంటారు కొడవటిగంటి కుటుంబరావు.

'పురుషులలో పుణ్యపురుషులు వేరయా అని వేమనగారు రామారావుగార్లాంటి వారిని చూసే చెప్పి వుంటారు. రామారావుగారి వంటి సజ్జనుడి సాంగత్యం లభించటం నా అదృష్టం. ఆయన లాంటి గొప్ప కథకులుండటం మన జనం అదృష్టం' అన్నారు రాచకొండ విశ్వనాథశాస్త్రి.

0 0 0

1998లో కాళీపట్నం రామారావుగారు ఒక వీలునామా వ్రాశారు. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

'వృత్తిరీత్యా రిటైరయినా తెలుగు సాహితీరంగానికి ముఖ్యంగా కథా ప్రక్రియకు, నేటి వరకూ ఏదో ఒక సేవ ఎంతో కొంతవరకూ చేస్తూ వచ్చాను. సాధ్యమైనంత నిరాడంబరంగా బ్రతుకుతూ స్వార్జితం మీద మాత్రమే జీవించా లన్నది నా జీవితాశయం. సాహిత్యం ద్వారా అడపాదడపా నాకు వచ్చిన చిన్నా పెద్దా మొత్తాలను సాహితీ రంగంలోనే ఖర్చు చేస్తూ వచ్చాను. నా చిరకాల వాంఛితం మేరకు 'కథానిలయం' పేర తెలుగు కథకు ఒక రిఫరెన్స్ లైబ్రరీ ఏర్పరచి, నేనేర్పరచిన ట్రస్టు ద్వారా దాని నిర్వహణ జరిపించాలుకున్నాను. ఆ మేరకు పత్రికల ద్వారా, ఉత్తరాల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రజలకూ, సాహిత్యాభిమానులకూ, రచయితలకూ నా పూనిక తెలియచేస్తూ వచ్చాను. నే తలపెట్టిన అపూర్వమైన ఈ బృహత్కార్యం పట్ల నా పట్ల గౌరవాభిమానాలతోనూ నమ్మకంతోనూ రచయితలూ సాహిత్యాభిమా నులూ ప్రత్యేకంగా నాపై అభిమానమున్న బంధుమిత్రులూ ధన రూపేణ, వస్తు రూపేణ, పుస్తకాలూ వారివారి రచనల జిరాక్సుల రూపేణ, పత్రికల, ప్రత్యేక సంచికల రూపేణ విరాళాలిచ్చి సహకరించారు. 1997 ఫిబ్రవరిలో ఆంధ్రదేశం నలుమూలలనించీ వచ్చిన రచయితల, సాహిత్యాభిమానుల సమక్షంలో కథానిలయం భవనం, అందులోని గ్రంధాలయం ఆవిష్కరణ జరిగింది'

ఇలా సాహిత్యాభిలాషతో నిస్వార్ధంగా కాళీపట్నం రామారావుగారు తన స్వంత డబ్బుతో ప్రారంభించిన కథానిలయం, ప్రచురింపబడ్డ ప్రతి తెలుగు కథనీ సమకూర్చుకుని, తెలుగు కథనీ కథా సాహిత్యాన్నీ కలకాలం నిలబడేటట్టు చేస్తున్నది.

తెలుగు కథ మీదా, సాహిత్యం మీదా రీసెర్చి చేసేవారికి అదొక సాహితీ బృందావనం.

అందుకే అనేది, తెలుగు కథ కంచికి వెళ్ళటం లేదు, కథానిలయానికి వెడుతుంది అని.

0 0 0

(ఈ వ్యాసానికి కాళీపట్నం రామారావు రచనలు, యజ్ఞంతో తొమ్మిది మొదలైన గ్రంధాలు ఎంతో సహాయపడ్డాయి. వారికి నా ధన్యవాదాలు)

